# గుజరాత్ తీరంలో భారీగా డ్రగ్స్

గాంధీనగర్ :అమృత్ తెలంగాణ: గుజరాత్ తీరంలో మరొకసారి డ్రగ్స్ కలకలం రేపింది. రూ. 1800 కోట్ల విలువైన 300 కేజీల మాదక పదార్థాలను అధికారులు సీజ్ చేశారు. ఇండియన్ కోస్ట్‌గార్డ్ (ఐసిజి),గుజరాత్ యాంటీ–టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అర్ధరాత్రి నిర్వహించిన జాయింట్ ఆపరేషన్‌లో ఈ డ్రగ్స్‌ను సిబ్బంది స్వాధీనంచేసుకున్నారు. అధికారులుతెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయమైన సమాచారంతో ఈఆపరేషన్‌ను చేపట్టాయి. అనుమానాస్పద బోట్ కనిపించటంలో అక్కడికి సిబ్బంది వెళ్లింది. దీంతో అందులో డ్రగ్స్ మూటలతో ఉన్న దుండగులు సిబ్బంది రాకను గమనించారు. వెంటనే ఆ సరకును సముద్రంలో పడేశారు. ఆ వెంటనే అంతర్జాతీయ సరిహద్దు వైపు పారిపోయారు. డ్రగ్స్ ముఠా ఆటకట్టించటానికి వెళ్లిన సిబ్బంది వెంటనే నీళ్లలో మునిగిన ఆ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నది. 300 కేజీలకు పైగా నిషేధిత మెథాంఫెటమైన్ ఉన్నట్టు అధికారులు గుర్తించారు. పట్టుబడినఈ డ్రగ్స్ విలువ రూ. 1800 కోట్లను ప్రాథమికంగా అంచనా వేశారు.

# అమృత్ తెలంగాణ


తెలుగు దిన పత్రిక

# అంబేద్కర్‌పై గౌరవం మాటలకే పరిమితం

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చే ఉద్దేశం మోడీ ప్రభుత్వానికి లేదని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. బిజెపి–ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగ నిర్మాతకు శత్రువులని అన్నారు. 'మోడీ ప్రభుత్వానికి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై గౌరవం మాటలకే పరిమితం. ఆయన ఆశయాలను నెరవేర్చే ఉద్దేశం వారికి లేదు. ఆయన వారసత్వంపై పెదవి విరుస్తున్నారు. 1952 ఎన్నికల్లో అంబేద్కర్ ఓటమికి ఎస్ ఏ డాంగే, వీడీ సావర్కర్‌లు కారణం. ఈ విషయాన్ని అంబేద్కర్ ఒక లేఖలో పేర్కొన్నారు" అని ఖర్గే వ్యాఖ్యానించారు. అలాగే, దేశవ్యాప్తంగా కులగణన అవసరాన్ని ఖర్గే నొక్కి చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్లు అమలుచేయాలని అన్నారు. "రాజ్యాంగం.. పౌరులకు అంబేద్కర్ ఇచ్చిన బహుమతి. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం పొందే హక్కును కల్పిస్తుంది. ఏఐసీసీ సమావేశంలో సామాజిక న్యాయానికి సంబంధించిన అభిప్రాయాలను ముందుకు తీసుకెళుతున్నాం" అని అన్నారు.

సంపుటి: 01 సంచిక : 191. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ మంగళవారం.15.04.2025 పేజీలు:4, వెల:రూ.1.00

# కంచ గచ్చిబౌలి భూములపై స్పందించిన ప్రధాని మోదీ.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఫైర్!




అమృత్ తెలంగాణ: హైదరాబాద్‌లోని కంచె గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. ప్రకృతిని నాశనం చేస్తూ, వన్యప్రాణులకు హానీ చేయడం ఇదే కాంగ్రెస్ పాలనగా మారిందని మండిపడ్డారు. హరియాణాలోని యమునా నగర్‌లో 800 మెగావాట్ల అధునాతన థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఆయన సోమవారం నాడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. 2014 కంటే ముందు కాంగ్రెస్ పాలనను మనం అస్సలు మరిచిపోకూడదని మోదీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దేశం మొత్తాన్ని అంధకారంలోకి నెట్టేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇప్పటికీ అవే పరిస్థితులు ఉన్నాయని మండిపడ్డారు. రాజకీయాలు అనేవి తమకు అధికారం కోసం కాదని.. ప్రజలకు సేవ చేయడానికి ఒక మాధ్యమం మాత్రమేనని పేర్కొన్నారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వానికి అలా కాదని అన్నారు. ఒకసారి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను గమనిస్తే ఆ విషయం స్పష్టమవుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందని ప్రధాని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లో ఇప్పటికే అన్ని పనులు నిలిచిపోయాయని తెలిపారు. కర్ణాటకలో అయితే ప్రతిదీ ఖరీదైనదిగా మారిపోయిందని అన్నారు. అవినీతిలో కర్ణాటకను దేశంలోనే నంబర్‌వన్‌గా మార్చారని ఆరోపించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి సన్నిహితులే స్వయంగా చెబుతున్నారని తెలిపారు. ఇక గ్యారంటీలో పేరుతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని ప్రధాని మోదీ విమర్శించారు. హామీల అమలును వదిలేసి, అడవులపై బుల్డోజర్లను నడిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం బిజీగా ఉందని మండిపడ్డారు. ప్రకృతిని ధ్వంసం చేసి వన్యప్రాణులను చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేం పర్యావరణాన్ని కాపాడుతుంటే, వాళ్లు అటవీ సంపదను సర్వనాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అమల్లోకి ఎస్సీ వర్గీకరణ చట్టం

**ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ స్వరూపం**

| | |
|---|---|
| మొత్తం ఎస్సీ రిజర్వేషన్లు | 15శాతం |
| గ్రూప్–ఏ(15 ఉపకులాలు) | 1శాతం |
| గ్రూప్–బీ (మాదిగ సహా 18 కులాలు) | 9 శాతం |
| గ్రూప్–సీ (మాల సహా 26 కులాలు) | 5 శాతం |



హైదరాబాద్, ఏప్రిల్14 అమృత్ తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) చట్టం–2025 పేరిట గెజిట్ విడుదల చేసింది. ఇది తక్షణం అమల్లోకి వచ్చినట్టు స్పష్టంచేసింది. ఎస్సీలకు ఇప్పటివరకు ఉమ్మడిగా అమలైన రిజర్వేషన్లు, ఇకపై గ్రూపులవారీగా అమలు కానున్నాయని తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 59 షెడ్యూల్డ్ కులాలు ఉండగా ఇప్పటివరకు ఆ కులాలకు 15శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నది.

ప్రస్తుతం మొత్తం షెడ్యూల్డ్ కులాలను వాటి జనాభా, ఆర్థిక వెనుకబాటు ఆధారంగా 3 గ్రూపులుగా ప్రభుత్వం విభజించింది. విద్యా, ఉద్యోగ నియామకాల్లో, స్థానిక సంస్థల్లో ఇతర వాటిల్లో సవరించిన రిజర్వేషన్లను మాత్రమే పాటించాలని గెజిట్‌లో వెల్లడించింది. గెజిట్‌తో పాటుగా రిజర్వేషన్ల అమలుకు మార్గదర్శకాలను, ప్రభుత్వ సర్వీస్ నియమకాల కోసం రోస్టర్ పాయింట్లను కూడా సవరిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు విడుదల చేసింది.

జనాభా లెక్కల తర్వాతనే రిజర్వేషన్ పెంపు: మంత్రి ఉత్తమ్

ఎస్సీ రిజర్వేషన్ ఉప వర్గీకరణ చట్టం గెజిట్ కాపీపై మంత్రివర్గ ఉపసంఘం సచివాలయంలో సోమవారం చర్చించింది. గెజిట్ తొలి కాపీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేసింది. అనంతరం ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2026 జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రంలో ఎస్సీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్ శాతాన్ని పెంచుతామని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి విద్యా, ఉద్యోగ అవకాశాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించామని, ప్రభుత్వం చేపట్టిన వర్గీకరణ ఏ కులానికీ వ్యతిరేకంకాదని చెప్పారు. వర్గీకరణ కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరులకు నివాళి అర్పించారు.

చట్టం నూతన మార్గదర్శకాలు

ప్రభుత్వ ఉద్యోగాలను తొలుత గ్రూప్–1లోని కులాలతో, అకడ మిగిలితే గ్రూప్–2, ఆ తర్వాత గ్రూప్–3లోని కులాలతో భర్తీ చేస్తారు. 3 గ్రూపుల్లోనూ అర్హత కలిగిన అభ్యర్థులు లేకపోతే ఆ ఖాళీలను క్యారీ ఫార్వర్డ్ చేస్తారు.

గ్రూప్–1లోని కులాలకు 7వ రోస్టర్ పాయింట్‌ను, గ్రూప్–2 కులాలకు 16, 27, 47, 52, 66, 72, 87, 97, గ్రూప్–సీలోని కులాలకు 22, 41, 62, 77, 91 రోస్టర్ పాయింట్లను కేటాయించారు.

ఎస్సీ మహిళలకు సంబంధించి 33.3 శాతం రిజర్వేషన్ కేటాయించారు.

ఇప్పటికే జారీ అయిన ఉద్యోగ నోటిఫికేషన్లకు ఈ చట్టం వర్తించదు.

ఎస్సీ రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వ నియామకాలు, విద్యా సంస్థల్లోనే అమలవుతాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లోని సీట్ల భర్తీకి ఈ చట్టం వర్తించదు.

చట్టం ద్వారా ఎదురయ్యే అన్ని అంశాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

# ఏ వ్యవస్థలోనైనా 10% చెడ్డవాళ్లు!

హైదరాబాద్, ఏప్రిల్ 14 .అమృత్ తెలంగాణ: భూ వివాదాల్లేని తెలంగాణ తెస్తామని, భూ సమస్యల పరిష్కారానికే భూభారతిని తీసుకొచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. శిల్పకళా వేదికలో సోమవారం ఆయన భూభారతి పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవెన్యూ వ్యవస్థను, అధికారులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏ వ్యవస్థలోనైనా 10 శాతం చెడ్డవాళ్లు ఉంటారని, తాము చట్టాలు చేసినప్పటికీ వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి.. ప్రజలకు ఉపయోగపడేలా చేయాల్సింది రెవెన్యూ అధికారులేనని రేవంత్ అన్నారు. 'మా ప్రభుత్వం మిమ్మల్ని సంపూర్ణంగా విశ్వసిస్తున్నది. మీరు, మేము వేర్వేరు కాదు. మేం చేసిన చట్టాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సింది మీరే. ప్రభుత్వానికి రైతులు, రెవెన్యూశాఖ రెండు కళ్లలాంటివి' అని అన్నారు. రెవెన్యూ అధికారులు ఏ తప్పు చేయొద్దని, పక్కాగా చట్టాన్ని అమలు చేద్దామని సూచించారు. 'మేం అవినీతికి పాల్పడే వ్యక్తులపైన కఠినంగా ఉంటాం.. కానీ వ్యవస్థపై కాదు. ఎవరి భూమి వారికి లెక్క రాద్దాం' అని చెప్పారు. మనుషులకు ఆధార్ మాదిరిగా ప్రతి భూమికి భూధార్ నంబర్ తీసుకొస్తామని, ప్రతి రైతు భూమికి ఆ నంబర్ ఇస్తామని చెప్పారు. తెలంగాణ సరిహద్దులనే నిర్ణయించిన రెవెన్యూ అధికారులు.. రైతుల భూమి హద్దులు నిర్ణయించలేరా అని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని తెలిపారు. ఇవే కాకుండా ఇతర జిల్లాల్లోనూ ఒక్కో మండలాన్ని ఎంపిక చేసి అమలు చేస్తామని చెప్పారు. కలెక్టర్లు ప్రతిరోజు రెండు మండలాల్లో రెవెన్యూ సదస్సులకు హాజరై ప్రజలకు భూభారతిపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇక ప్రభుత్వ భూములను ఏండ్లుగా సాగు చేసుకుంటున్న పేదలకు ఆ భూములపై హక్కు కల్పించేందుకు అసైన్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ద్వారా అసైన్డ్ కమిటీలను పునరుద్ధరించి అసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్న అర్హత కలిగిన పేదవారికిప్రభుత్వం పట్టాలు పంపిణీ చేస్తుందని ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. భూభారతి 2025 చట్టం వందేళ్లు వర్ధిల్లుతుందని అన్నారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, ములుగు, కామారెడ్డి జిల్లాల్లోని నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్టు తెలిపారు. పైలట్ ప్రాజెక్టులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించి జూన్ 2వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూభారతిని అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి అంటే పూలమాలలు వేయడం కాదు.

అమృత్ తెలంగాణ: అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. మహిళలకు కార్మికులకు దళిత గిరిజనులకు అన్ని వర్గాల్లో వెలుగు నింపాడని తెలిపారు. అందరం సమాన హక్కులు పొందుతున్నామంటే దానికి అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే కారణమని పేర్కొన్నారు. చదవండి, బోధించండి, సమీకరించండి, పోరాడండి అనే మంత్రాన్ని చెప్పాడని అన్నారు. దాన్ని ముందుకు తీసుకు పోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందని తెలిపారు. చదువు లేకుంటే జీవితం లేదని అన్నారు. వివక్ష పై పోరాటం చేయాలని అంబేద్కర్ చెప్పారని అన్నారు. అంబేద్కర్ జయంతి అంటే పూల మాలలు వేయడం కాదు, వారి ఆశయాలను కొనసాగించాలని హరీశ్‌రావు సూచించారు. అంబేద్కర్ సిద్ధాంతాలు పాటించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అంబేద్కర్ రాజ్యాంగమే దారి చూపిందని తెలిపారు.

# అంబేద్కర్ అభయహస్తం అమలు చేసేదెప్పుడు?.. దళితులకు 12 లక్షలు ఇచ్చేదెప్పుడు?: కేటీఆర్



హైదరాబాద్:అమృత్ తెలంగాణ: కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆధునిక భారతావనికి పునాదులు వేశారని తెలిపారు. బాబాసాహెబ్ ఆలోచన, ముందు చూపు చాలా గొప్పదని వెల్లడించారు. దేశంలో అందరూ బాగుండాలన్నదే అంబేద్కర్ ఆలోచన అని చెప్పారు. అంబేద్కర్ ఆలోచనను కేసీఆర్ ఆచరణలో పెట్టారన్నారు. దళితబంధు లాంటి పథకాన్ని అమలు చేసిన దమ్మున్న నాయకుడు కేసీఆర్ అన్నారు. అబద్ధపు ప్రచారంతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని, దళితులకు అంబేద్కర్ అభయహస్తం ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. రూ. 12 లక్షల కాదుకదా.. 12 రూపాయలు కూడా ఇవ్వరని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్.. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు అంబేద్కర్ ఆలోచనలే కారణమన్నారు. ప్రజాస్వామ్యంలో మందబలంతో అవతలివారి గొంతు నొక్కేయడం ఉండకూడదని అందరితో కొట్లాడి కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు ఉన్న రాష్ట్రం అనుమతి ఉండాల్సిన అవసరం లేదని పేర్కొంటూ రాజ్యాంగంలో ఆర్టికల్ 3ని పొందుపర్చారన్నారు. మనం ఇప్పుడు తెలంగాణలో మాట్లాడుతున్నామంటే దానికి కారకుడు ఒకేఒక్కరు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని చెప్పారు. బాబాసాహెబ్ ఆలోచన, ముందు చూపు చాలా గొప్పదన్నారు. అంబేద్కర్‌ను కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితమని, దళిత బిడ్డ కాబట్టి దళిత జాతికి మాత్రమే నాయకుడు అన్నట్టుగా కొందరు ఆయనను తక్కువ చేసే ప్రయత్నం చేస్తారు. స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, వారితోపాటు కొట్లాడిన వేలాది లక్షలాది మంది ఎలాగైతే కీలకపాత్ర పోషించారో, స్వాతంత్ర్యానంతరం ఆధునిక భారతావనికి అంబేద్కర్ పునాది వేసిన అద్భుతమైన నాయకుడు అంబేద్కర్. దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు చిన్న చిన్న రాష్ట్రాలు ఉండేవి. ఎన్ని భాషలు, మతాలు, కులాలు, ఉపకులాలు, సంస్కృతులు ఉండేవి. నలుగురు కలిసిఉండటం కష్టం. ఇన్ని వైవిధ్యాలున్న ఈ దేశాన్ని శాశ్వతంగా సుదీర్ఘ కాలం కలిసి ఉండాలంటే ఏం చేయాలని అంబేద్కర్, డాక్టర్ ఫజల్ అలీ వంటి మేధావులు ఆలోచించి భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుకు ఆలోచన చేశారు. ఆ సమయంలోనే ఒక రాష్ట్రంలో ఒక భాష ఉండాలనేది మంచి ఆలోచనే, కానీ కచ్చితంగా ఒక భాషకు ఒక రాష్ట్రం ఉండాలనడం తప్పు. ఒక భాషకు నాలుగైదు రాష్ట్రాలు ఉండొచ్చు. పరిపాలనా సౌలభ్యం చిన్న రాష్ట్రాలు ఉంటే తప్పులేదని ఆలోచన చేసిన నాయకుడు బాబాసాహెబ్ అంబేద్కర్. నాటు అంబేద్కర్ నాయకత్వంలో రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలనే మనం పాటిస్తున్నాం. 78 ఏండ్ల తర్వాత కూడా రాజ్యాంగమే మనలను కాపాడుతున్నది. దేశంలో అందరూ బాగుండాలన్నదే అంబేద్కర్ ఆలోచన అన్నారు.

అంబేద్కర్ నమ్మిన సిద్దాంతం బోధించు, సమీకరించు, పోరాడు అనే తత్వాన్ని అర్థం చేసుకుని, ఆచరణలో పెట్టిందే కేసీఆర్. పార్టీ పెట్టిన మొదటి రోజు నుంచి లక్షల సంఖ్యలో ప్రజలను సమీకరిస్తూ, వారికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను బోధిస్తూ, వివరిస్తూ, తెలంగాణకు అన్యాయం జరిగితే పోరాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యంగం ఆధారంగా రాష్ట్రాన్ని సాధించిన మహానాయకుడు కేసీఆర్. అలా సాధించుకున్న రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా కార్యక్రమాలు అమలుచేశారు.

అంబేద్కర్‌ను అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదువుకోవడానికి బరోడా మహారాజ్ ఆశీర్వదించి పంపారు. బరోడా మహారాజ్ ఒక అంబేద్కర్‌కు దీవెన ఇచ్చారు. కానీ మన ప్రభుత్వంలో వేలాది మంది పిల్లలను అమెరికా పంపించాం, లక్షలాది పిల్లలను పటిష్టమైన పునాదివేశాం. 1022 పాఠశాలలు పెట్టి, ఒక్కో విద్యార్థిపై నెలకు రూ. 10 వేలు, సంవత్సరానికి లక్షా 25 వేలు ఖర్చుపెట్టి ప్రపంచంతో పోటీ పడేలా తయారుచేసి అంబేద్కర్ ఆలోచనను కేసీఆర్ ఆచరణలో పెట్టిన నాయకుడు కేసీఆర్. గురుకులాలు మాత్రమే కాదు, పదేండ్ల కాలంలో 7 వేల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షలు ఇచ్చి విదేశి విద్య అభ్యసించడానికి తెలంగాణ నుంచి పంపించాం. రాజకీయాల్లో అప్పుడుఅప్పుడు ఓడుతాం.. గెలుస్తాం. అవన్నీ ఒక విషయం కాదు. కానీ కేసీఆర్ లాంటి సాహసి, స్వాప్నికుడు, దమ్మున్న నాయుడు మాత్రమే దళితబంధులాంటి కార్యక్రమాన్ని ఆలోచన చేయగలుగుతాడు. రాజకీయాలు ఆలోచించి లాభనష్టాలు బేరీజు వేసుకుని ఇస్తే సీట్లు వస్తయా, ఇయ్యకపోతే సీట్లు వస్తయా అని ఆలోచించేటోనికి అర్థంకూడా కాదు. ఎందుకంటే ఒక రైతుబంధు పెట్టాలన్నా ఖలేజా ఉండాలి. దళితబందు పెట్టాలన్నా, పేదవాడికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పాలన్నా దమ్ముండాలి. ఆ దమ్మున్న నాయకుడే కేసీఆరే.

వెయ్యి మైళ్ల ప్రయాణం కూడా ఒక్క అడుగుతోనే మొదలైతది. ఆ వెయ్యి మైళ్ల ప్రయాణానికి భారతదేశ స్వాతంత్ర్యానంతరం మొదటిసారి ఒక స్వాప్నికుడిలా ఆలోచించి దళితులు ధనికులు ఎందుకు కావొద్దని ఆలోచించిన నాయకుడు కేసీఆర్. దళితబంధు పథకంతో లక్షలాది మంది జీవితాలను మార్చలేకపోవచ్చు. కేసీఆర్ లాంటి నాయకుడి చేతిలో అపరిమితమైన వనరులు ఉంటే చాలా చేస్తుండే. కానీ పరిమితమైన వనరులతో ఉన్నంతలో ఏడాదికి ఇన్ని వేలమందికి అని దళితబంధు పథకం తెచ్చినం. దానికి విపరీత అర్థాలు తీసి కొందరు చిల్లరగాళ్లు రాజకీయ లబ్ధి పొందొచ్చు. కానీ దళితబంధులాంటి పథకం ప్రవేశపెట్టినందుకు కేసీఆర్ సైనికుడిగా గర్వపడుతున్నా. వారికి సెల్యూట్ చేస్తున్నా. అంబేద్కర్ పేరువాడుకుని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని అడగాలి. ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ పేరుతో దళితులకు రూ. 12 లక్షలు ఇస్తామని చేవెళ్లలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో చెప్పించారు. ఇప్పుడు రేవంత్ రెడ్డిని అడుగుతున్నా రెండు బడ్జెట్లు పెట్టినవ్. ఇంకెప్పుడిస్తవ్ అంబేద్కర్ అభయ హస్తం. రూ. 12 లక్షలు కాదుకదా రూ. 12 కూడా ఇవ్వడని అందరికీ అర్థమైపోయింది. డబుల్ బెడ్‌రూమ్ పథకం కింద ఎస్సీ ఎస్టీలకు రూ. 6 లక్ష ఇస్తానని చెప్పిండు. బాబాసాహెబ్ జయంతి సందర్భంగా నీ రూ. 6 లక్షల మాట ఏమైందని అడుగుతున్నా. ఖర్గే ఎక్కడున్నడు, రాహుల్ గాంధీ ఎక్కడున్నడు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో మీరు చెప్పిన కథలన్నీ ఏమైనయ్.

ఎస్సీ, ఎస్టీలకు 28 శాతం ప్రభుత్వ కాంట్రాక్టుల్లో వాటా కలిపిస్తామని చెప్పారు.. ఇకెందుకు చేయలేదు రేవంత్ రెడ్డి?. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పిన హామీ ఏమైంది?. ఎస్సీ, ఎస్టీలకు విద్యాజ్యోతిల పథకం కింద 10వ తరగతి పాస్ అయితే రూ. 10 వేలు, ఇంటర్ పాస్ అయితే రూ. 15 వేలు, గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తే రూ. 25 వేలు, పీజీ చేస్తే లక్ష, పీహెచ్డీలు చేస్తే రూ. 5 లక్షలు ఇస్తామన్నారు.. ఏమైందని నేడు అడుగుతున్నా. రేవంత్ రెడ్డి దళిత సమాజానికి, ప్రజలకు సమాధానం చెప్పాలి.

మోదీ ప్రభుత్వం పేదల వ్యతిరేక ప్రభుత్వం. పేదలకు రూ. 2000 పెన్షన్ ఇస్తే, రుణమాఫీ చేస్తే, ఉచిత కరెంట్ ఇస్తే మోడీకి నచ్చదు కానీ రూ. 16.50 లక్షల కోట్లు పెద్ద పెద్ద కార్పొరేట్లకు మాఫీ చేస్తే మోదీకి నచ్చుతుంది. తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ పార్టీ తుఫాన్ వేగంతో అధికారంలోకి వస్తుంది' అని కేటీఆర్ అన్నారు.

# యెమెన్‌లో అమెరికా వైమానిక దాడులు.. ఆరుగురు మృతి



సానా : అమృత్ తెలంగాణ:యెమెన్ రెబెల్స్ నియంత్రణలో వున్న రాజధాని సానాపై అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో ఆరుగురు మరణించగా, 26మంది గాయపడ్డారు. ఆదివారం రాత్రి ఈ దాడులు జరిగాయి. ఇదిలా వుండగా అమెరికాకు చెందిన ఎంక్యు రీపర్ డ్రోన్‌ను తాము కూల్చివేశామని హౌతి రెబెల్స్ తెలిపారు. నెల రోజుల క్రితం అమెరికా ఈ తరహాలో దాడులు ఆరంభించినప్పటి నుండి ఇప్పటివరకు 120మందికి పైగా మరణించారని హౌతి ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. రెండు వారాల్లో రెబెల్స్ జరిపిన నాల్గవ దాడి ఇది. స్థానికంగా తయారుచేసిన క్షిపణితోనే తాము ఆ డ్రోన్‌ను లక్ష్యంగా చేసుకున్నామని హౌతిలు తెలిపారు. ఇదిలావుండగా అమెరికా వైమానిక దాడులతో తలెత్తిన మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక యంత్రాలు నీటిని జల్లుతున్న దృశ్యాలను హౌతిలకు చెందిన ఉపగ్రహ వార్తా చానెల్ ప్రసారం చేసింది. ఆ ప్రాంతమంతా చెల్లా చెదురుగా శిథిలాలు పడి వున్నాయి. సానాలోని బని మటర్ ప్రాంతంలో గల సిరామిక్స్ ఫ్యాక్టరీపై దాడి జరిగిందని ఆ వర్గాలు తెలిపాయి. కాగా అమెరికా మిలటరీ సెంట్రల్ కమాండ్ మాత్రం ఈ దాడుల గురించి ప్రకటించలేదు. తాము దాడులు జరిపే లక్ష్యాలేమిటన్న సమాచారం కూడా అమెరికా సైన్యం ఇవ్వడం లేదు. ఇప్పటివరకు 200కి పైగా దాడులు జరిగాయని వైట్‌హౌస్ తెలిపింది.

# అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

## బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి.



నిర్మల్ జిల్లా ఏప్రిల్ 14 అమృత్ తెలంగాణ 134వ అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నివాళులర్పించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, జెండా ఆవిష్కరన చేసి అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, మాట్లాడుతూ అంబేద్కర్, ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అంబేద్కర్, అనేక సార్లు అవమానపర్చి, ఆయన ఓటమికి కొన్ని పార్టీలు కారణమని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని రాజ్యాంగాలను పరిశీలించి ఒక గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహా మేధావి అంబేద్కర్ అని అన్నారు. భారతదేశం ప్రపంచంలో ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు దేశ అభివృద్ధికి అంబేద్కర్, ఇచ్చిన రాజ్యాంగం ఎంతో స్ఫూర్తి దాయకం అని అన్నారు. వారి స్ఫూర్తి గా ముంబై లో 140అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్నందుకు ఆనందంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న దళిత బిడ్డల కోసం, విదేశాల్లో వారి చదువుల కోసం కేంద్ర ప్రభుత్వం 56 వేల కోట్లు కేటాయించడం హర్షణీయం. వారి బాటలో నడవాలని, వారి ఆశయాల సాధనకు ప్రతీ ఒక్క భారతీయుడు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, దళిత సంఘాల నాయకులు, జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు రాచకొండ సాగర్, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, తాజా మాజీ కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బిజెఎల్పి నేత ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, దళిత సంఘ నాయకులు

# కుబీర్ లో ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134 వ జయంతి ఉత్సవాలు



కుబీర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



నిర్మల్ జిల్లా కుబీర్ ఏప్రిల్ 14 అమృత్ తెలంగాణ కుబీర్ మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జన్మదినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ చైర్మన్ డాక్టర్ సాప పండరి, మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కారణజన్ముడని, కలియుగ పురుషుడని, కులమత భేదాలు లేకుండా, అందరూ సమానమే అని భావించి రాజ్యాంగాన్ని రాశారని గుర్తు చేశారు. "శోధించు–సమీకరించు–పోరాడు అని మూడు అంశాలపై మనము పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, రాజ్యాంగం పట్ల, మనకు కలిగి ఉన్న హక్కులను తెలుసుకొని సమాజంలో కులమత తేడాలు లేకుండా నవభారత సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసిమెలిసి ఉండాలని, ఏరోజైతే ఒక వ్యక్తి ఆత్మ న్యూనత, ఆత్మాభిమానం చంపుకోకుండా సమాజంలో తిరగ గలుగుతాడో ఆ రోజే మనకు నిజమైన స్వాతంత్రం వచ్చినట్టని, అంటరానితనం, కుల బహిష్కరణలకు దూరంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐటి ప్రకాష్, మాజీ ఎంపీపీ బోయిడి విట్టల్, మాజీ సర్పంచ్ మీరా విజయ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కందూర్ సంతోష్,నాయకులు ఏషాల దత్తాత్రి,బొప్ప నాగలింగం,బషీర్,జావిద్ ఖాన్,ఏక్బాలుద్దీన్,రాహుఫ్, గోరేఖర్ సంతోష్, దుగ్గే సందీప్,అలికే దత్తాత్రి,ఎన్నిల నాగేందర్, సూది రాజన్న,మహిళలు,అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కస్తూరే రాహుల్, ఉపాధ్యక్షులు నాగోరావు,కార్యవర్గ సభ్యులు, మహిళలు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి





కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులు

నిర్మల్ జిల్లా లోకేశ్వరం ఏప్రిల్ 14 అమృత్ తెలంగాణ లోకేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ సుదర్శన్ రెడ్డి, తండ్రి గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జీ విఠల్ రెడ్డి సోమవారం వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. వీరితోపాటు పిప్పిరి మాజీ సర్పంచ్ సాయన్న, ఎంపీటీసీ అనిల్, మల్లయ్య పోశెట్టి ధర్మారం భూమన్న సాయి సతీష్ రెడ్డి ఉన్నారు.

# రాజ్యాంగాన్ని మార్చే హక్కు ఎవరికీ లేదు...

అంబేద్కర్ ఆశయాల తో ముందుకు సాగుతున్న ప్రధాని నరేంద్ర మోదీ....
జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్......



బైంసా పట్టణ కేంద్రంలో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లా బైంసా ఏప్రిల్ 14 అమృత్ తెలంగాణ బైంసా పట్టణ కేంద్రంలో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చే హక్కు ఎవరికి లేదని, అది దేశ ప్రజల పవిత్ర గ్రంథమని అన్నారు. సోమవారం అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని, బైంసాలో బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అంబేద్కర్ ఆశయ సాధన కోసం పాటుపడుతున్నారని, ఆయన చేసిన సేవ ప్రపంచానికి చాటాలని కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి, పంచ తీర్థాల పేరుతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఏ పార్టీలైనా, ఈ ప్రభుత్వాలైన అంబేద్కర్ గౌరవిస్తున్నాయని, తెలంగాణలో గత ప్రభుత్వం సచివాలయానికి అంబేద్కర్ పేరు నామకరణం చేయడం, ట్యాంక్ బండ్ వద్ద 100 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి, మహనీయుని సేవలను గుర్తించిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్లో అంబేద్కర్ చిత్రపటాన్ని ఉంచారన్నారు. న్యాయ మంత్రిత్వ శాఖలో, సుప్రీంకోర్టులో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దళిత సంఘ నాయకులు ప్రజలు పాల్గొన్నారు

# సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి ఏప్రిల్ 14 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలోని సమత ఫౌండేషన్ క్యాంప్ కార్యాలయంలో సమత ఫౌండేషన్ చైర్మన్ ఆదేశానుసారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా సమత ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ వలన బడుగు,బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఉద్యోగ రంగాలలో, రాజకీయరంగంలో పలు అవకాశాలు దక్కడానికి అవకాశాలు కల్పించారని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిచేలా రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ కు భారతరత్న అవార్డు రావడం గర్వించదగ్గ విషయమని కొందరు వ్యక్తుల మానసిక వ్యవస్థలోని రుగ్మతలను తొలగించడానికి ప్రయత్నిస్తే కొందరు సమాజంలో ఉన్న రుగ్మతలను తొలగించడానికి కృషి చేస్తారు అందుకు సామాజిక ఆర్థిక రాజకీయ శాస్త్రాల అధ్యయనం అవసరం భారతదేశంలో కులం చట్రం నుండి బయటకు రాలేక చాలామంది దేశ నాయకులు ప్రపంచ మేధావులు కాలేకపోయారు కానీ అంబేద్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రబాసించడానికి కారణం ఆయన నిరంతర అధ్యయనం విద్య ద్వారా ఇంతగా రాణించిన వారు మరొకరు లేరు తన అధ్యయనం నుండి మహా మహోపాధ్యాయుడిగా ఎదిగారు. అనేక సందర్భాల్లో ఆయనకు ఎదురుగా వాదించిన మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ సైతం భారత రాజ్యాంగ నిర్మాణం విషయంలో ఆయన్ని అభినందించక తప్పలేదు అంబేద్కర్ ప్రపంచ తత్వవేత్తల అందరిని అధ్యయనం చేశారు. బుద్ధుడి అశోకుడి తర్వాత ఆసియా నుండి ప్రపంచ దేశాలను వెలిగిస్తున్న జ్ఞాన సూర్యుడు అంబేద్కర్ ఆ వెలుగుల్లో మనం పయనిద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో సీఈఓ అనిల్ కుమార్, సాజిద్,రాజు, ఫర్వేజ్,జావేద్,గంగారాం,భుమన్న,నవీన్, తదితరులు పాల్గొన్నారు



సమత ఫౌండేషన్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

# నిర్మల్ జిల్లా కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134 వ జయంతి బైక్ ర్యాలీ.

## దళిత సంఘాల ఐక్యవేదిక నిర్మల్ జిల్లా.



బైక్ ర్యాలీ

నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 14 ( అమృత్ తెలంగాణ ) నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం రోజు సోఫీ నగర్లో గల నిర్మల్ బుద్ధ విహార్ నుండి ఉదయము 8 గంటలకు దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్ అంబేద్కర్ 134 వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బుద్ధ విహారలో గౌతమ బుద్ధుడు విగ్రహానికి అంబేద్కర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు సమర్పించి బైక్ ర్యాలీని ప్రారంభించడం జరిగింది. ఈ ర్యాలీ డిజె సౌండ్ సిస్టం ఆటపాటలతో బుద్ధ విహార్ నుండి మొదలుకొని శివాజీ చౌక్ చైన్ గేట్ ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా వివేక్ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు చేరుకొని అక్కడ అంబేద్కర్ విగ్రహానికి జ్యోతి ప్రజ్వలన అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ చేశారు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పూలమాలవేసి నీలి జెండాను ఆవిష్కరించారు మాజీ రాష్ట్ర మంత్రివర్యులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పంచశీల జెండాను ఎగురవేశారు బుద్ధ విహార కమిటీ ఉపాసకులచే పంచశీల ప్రార్థన గీతాన్ని పాడారు అనంతరము అక్కడినుండి బైక్ ర్యాలీ ప్రారంభమై అంబేద్కర్ భవనం వరకు చేరుకుంది అంబేద్కర్ భవనం వద్ద అంబేద్కర్ భవన విగ్రహ కమిటీ అధ్యక్షులు ముడుసు సత్యనారాయణ పంచశీల జెండాను ఎగరవేశారు సాంఘిక సంక్షేమ జిల్లా అధికారి రాజేశ్వర్ గౌడ్ నీలి జెండాను ఎగురవేశారు అంబేద్కర్ భవనంలో అంబేద్కర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేశారు అంబేద్కర్ జయంతి సభ అనంతరం భోజన సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమాలలో దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు పడిగెల రాజేశ్వర్, కుంటోల్ల వెంకటస్వామి, వెలుమల ప్రభాకర్, డి రాములు, బత్తుల రంజిత్ కుమార్, ఎలుమల రాజేశ్వర్, బొడ్డు లక్ష్మణ్, ప్రభాకర్ సానే, మధుకర్ మునేశ్వర్, డి క్రాంతి కిరణ్, కొంతం మురళీధర్, ఈరోల్ల పురుషోత్తం, మైపాల్ ప్రభుదాస్, అంబకంటి ముత్తన్న, అనంతరావు దుర్గే, కే శంకర్, డి మోహన్, సిద్ధ నాగభూషణం, గంధం విట్టల్, చేపూరి సిద్ధార్థ, జి రాజేశ్వర్, సింగరి జగదీశ్వర్, డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు దామెర రాములు, బోర్ కార్ సురేష్, గడుపాలే రమేష్,ఉప్పు కృష్ణంరాజు ప్రమోద్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

# మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డా.బాబా సాహెబ్ అంబేద్కర్ 134 లో జయంతి



అదిలాబాద్ మాల సంఘం నాయకులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ సంఘ భవనం లో పంచశీల జెండా ఎగురవేసి,బుద్ద వందన పఠించడం జరిగింది. అధ్యక్షులు కొప్పుల రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాబాసాహెబ్ ఆశయం సాధన కు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి సుధాకర్, మేకల మల్లన్న, బేర దేవన్న, మెట్టు ప్రహ్లాద్,గంపల ప్రభాకర్,ఏరా సుధీర్, ముల్కల రాజేశ్వర్ ,సింగరి అశోక్,సూరం భగవాండ్లూ, దాసరి బాబన్న, మొట్టే కిరణ్, రాళ్ల బండి శంకర్, పాశం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ముధోల్ నియోజకవర్గం లో ఘనంగా భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు...

## పాల్గొన్న ముధోల్ మాజీ శాసనసభ్యులు జి విఠల్ రెడ్డి,



నిర్మల్ జిల్లా ముధోల్ బైంసా ఏప్రిల్ 14 అమృత్ తెలంగాణ ముధోల్ బైంసా పట్టణ కేంద్రంలలో మరియు తానూరు మండలం కేంద్రంలో మరియు జవుల భి గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి జయంతి వేడుకల్లో పాల్గొన్నా మాజీ శాసనసభ్యులు జి విటల్ రెడ్డి. అంబేద్కర్, బీద,బడుగు, బలహీన, పీడిత,అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. అంబేద్కర్ గారు రాసిన రాజ్యాంగం వల్లనే మనకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, అంబేద్కర్, రాసిన రాజ్యాంగం మనదేశంలోనే కాకుండా ఇతర దేశాలలో కూడా చట్టాలను అమలు చేస్తున్నారని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, రాసిన రాజ్యాంగం వల్లనే మనం ఇంత స్వేచ్ఛగా ఉన్నామని మానవ మనుగడ ఉన్నన్ని రోజులు అంబేద్కర్, పేరు చిరస్మరణీయంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు




అంబేద్కర్ జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి

# మెహుల్ చోక్సీ అరెస్ట్..

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను వేల కోట్ల రూపాయలకు మోసం చేసిన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని బెల్జియం పోలీసులు అరెస్ట్ చేశారు. చోక్సీని పట్టుకునేందుకు ఏడేళ్లుగా భారత దర్యాప్తు ఏజెన్సీలు ప్రయత్ని స్తున్నాయి. ఈ ఆర్థిక నేరగాడి కదలికలపై నిఘా పెడుతూ వచ్చిన అధికారులు ఎట్టకేలకు బెల్జియంలో అరెస్ట్ అయ్యేలా చేశారు. స్విట్జర్లాండ్‌కు పారిపోయేందుకు చోక్సీ ప్రణాళిక వేస్తున్న సమయంలో ఏప్రిల్ 12న బెల్జియం పోలీసులు పట్టుకున్నారు. గీతాంజలి గ్రూప్ యజమాని అయిన చోక్సీ తన మేనల్లుడు నీరవ్ మోడి, ఆయన సోదరుడు నిషాల్ మోడితో కలిసి



పిఎన్‌బికి రూ.13,500వేల కోట్ల పైగా కన్నం పెట్టారు. మోసం బయటపడటానికి ముందు 2018లో భారత్‌ను విడిచి పారిపోయారు. చోక్సీ అరెస్ట్ భారత్‌కు పెద్ద విజయం అని కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి పేర్కొన్నారు. తమ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగానే పేదల డబ్బును దొచుకున్న చోక్సీని అరెస్ట్ చేసిందన్నారు.

# నర్సాపూర్ జి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు : పాల్గొన్న నాయకులు ప్రజలు



కుస్లిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



చాక్పల్లి అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



నర్సాపూర్ జి లో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు దళిత సంఘాల నాయకులు

నిర్మల్ జిల్లా నర్సాపూర్( జి) ఏప్రిల్ 14 అమృత్ తెలంగాణ మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా భారతరత్న రాజ్యాంగ నిర్మాత దార్శినికుడు డాక్టర్ భీం రావ్ బాబాసాహెబ్ అంబేద్కర్, జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో కుల మతాలకు అతీతంగా గ్రామస్తులు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు ఘనంగా సన్మానించారు జై భీమ్ జై సంవిధాన్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి రాజ్యాంగం వర్ధిల్లాలి రాజ్యాంగాన్ని పరిరక్షించాలి అనే నినాదాలతో హోరెత్తించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుంటాల మాజీ ఎంపీపీ సయ్యాజి భోజరామ్ పటేల్ డిసిసిబి డైరెక్టర్ తూర్పాటి వెంకటేష్, నర్సాపూర్ జి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రకరణ్ రెడ్డి, కుంటాల మండల మాజీ వైస్ ఎంపీపీ సూర్యవంశీ లక్ష్మణ్, నర్సాపూర్ జి బిజెపి మండల అధ్యక్షుడు బార్కుంట నరేందర్, ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు ఎండి ఖదీర్, సామాజిక కార్యకర్త యువ నాయకులు అడ్వకేట్, సాఫ్ట్వేర్ ఇంజనీర్, జాదవ్ మోతిలాల్ పటేల్, సంతోష్ పటేల్ గ్రామ పంచాయతీ ఈవో కైలాస్, కార్యదర్శి నరేష్ కుమార్,, ఎండి నజీర్ అడ్డిగ పెంటన్న సాయన్న సతీష్ ఆర్టిఐ సామాజిక కార్యకర్త సయ్యద్ కలీం గౌతమ్ బుద్ధ అంబేద్కర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు


# చాంద - టి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న శ్రీకాంత్ రెడ్డి



గ్రామం చాందటిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : అంబెద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చాంద - టి గ్రామంలో ఏర్పాటుచేసిన రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబెద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరై బాబా సాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అంబెద్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు, మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు,ఆదిలాబాద్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నహీద్ , మాజి ఎంపిపి గోవర్ధన్ ,సీనియర్ నాయకులు నవీన్ రెడ్డి,విజయ్, మహ్మద్ వసీముద్దిన్,ప్రభాకర్, బాలకృష్ణ, ఎస్ కె రహీం,ఎండి అఫ్సర్,వెంకటేష్,శ్రీనివాస్ ముర్తుజా,,సెముల్లాఖాన్ అడెల్లు ,మన్సుర్ భాయ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 134 వ జయంతి ఉత్సవాలు



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 134 వ జయంతి ని పురస్కరించుకొని సోమవారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయ ఆవరణలో జ్యోతి ప్రజ్వలన గావించి అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేసిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా

# అదిలాబాద్ పట్టణంలోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదిలాబాద్ అదిలాబాద్ బిజెపి ఎంపీ నగేష్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బిజెపి జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం ప్రత్యేక పూజలు నిర్వహించారు





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్.అదిలాబాద్ పట్టణంలోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదిలాబాద్ అదిలాబాద్ బిజెపి ఎంపీ నగేష్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బిజెపి జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం ప్రత్యేక పూజలు నిర్వహించారు.మలయాళ సాంప్రదాయంలో భాగంగా నిర్వహించిన విషు పూజలో ఎమ్మెల్యే ఎంపీ తోపాటు. బిజెపి నేతలు పాల్గొన్నారు... ఆలయ కమిటీ నేతలకు ఘనంగా స్వాగతం పలికారు... పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి లక్ష్మీ విలాస్ సెట్ ఆధ్వర్యంలో పూజ నిర్వహించారు.. ఆలయ ప్రధాన పూజారి సంతోష్ శర్మ చేతుల మీదుగా పూజలు నిర్వహించగా, కౌట ప్రభాకర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి ల భజన బృందం ఆకట్టుకున్నాయి.. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు దారుట్ల జీవన్, ప్రధాన కార్యదర్శి దాముక రవి, నరేష్, గురుస్వాములు గణేష్, మహేందర్, విజయ్, సుబ్బన్న, అన్నోజుల srinivas, మోహన్,, లక్ష్మణ్, యువరాజ్, తోట సంతోష్ తదితరులు పాల్గొన్నారు...

# పదేళ్లు పార్టీని కాపాడుకుంటే ఇదేనా మాకిచ్చే గౌరవం.. మంత్రి పదవిపై మంచిర్యాల ఎమ్మెల్యే అసంతృప్తి



అమృత్ తెలంగాణ: మంత్రి పదవి విషయంలో ఇప్పటికే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతుండగా.. తాజాగా మరో ఎమ్మెల్యే కూడా నోరువిప్పాడు. మంత్రి పదవి విషయంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. అధిష్టానం తనకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మంత్రివర్గంలో నాకు చోటు లేకుంటే.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసినట్టే అని కాంగ్రెస్ పార్టీ అధిష్టానంపై ప్రేమ్‌సాగర్ రావు మండిపడ్డారు. ఆదివాసీలకు, పార్టీ కార్యకర్తలకు ఊపిరిగా నిలిచిన నాకే అన్యాయం చేస్తారా అని ప్రశ్నించారు. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు కావాలా? పదేళ్లు పార్టీని కాపాడుకుంటే ఇదేనా మాకిచ్చే గౌరవమని నిలదీశారు. ఇంద్రవెల్లి సభతో కాంగ్రెస్ పార్టీకి ఊపిరి పోశానని అన్నారు. మంత్రి పదవి విషయంలో మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు అధిష్ఠానం మంత్రిపదవి ఇస్తానంటుంటే.. సీనియర్‌నేత జానారెడ్డి అడ్డం పడుతున్నారని ఆరోపించారు. ధర్మరాజులా ఉండాల్సిన వ్యక్తి.. ధ్రుతరాష్ట్రుడిలా వ్యవహరిస్తున్నారని తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన నేతలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని అధిష్ఠానానికి జానారెడ్డి రాసిన లేఖపైనా రాజ్‌గోపాల్‌రెడ్డి మండిపడ్డారు. 30 ఏండ్లు మంత్రి పదవి అనుభవించిన జానారెడ్డికి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రి పదవి ఇవ్వాలనే విషయం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. భారత క్రికెట్ జట్టులో ఒక ఇంట్లో నుంచి ఇద్దరు క్రికెటర్లు ఉన్నట్టే మంత్రివర్గంలో ఒకే కుటుంబం నుంచి ఇద్దరు మంత్రులుంటే తప్పా? ప్రశ్నించారు.

# నేతల లోసుగులకు సోషల్ మీడియా ముసుగు....




అమృత్ తెలంగాణ, ఏది జర్నలిజం, ఎవరు జర్నలిస్టులు, మీడియా అంటే ఏమిటి, మీడియాకు నిర్వచనం ఏమిటి, ఎవరెవరు మీడియా కిందికి వస్తారు? అనే అంశాలమీద చాలా రోజులుగా చర్చ జరుగుతున్నది. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ వేదిక నుంచి 'జర్నలిస్టులు ఎవరో నిర్వచించండి' అని జర్నలిస్టు పెద్దలను కోరిన తర్వాత కొందరు ప్రముఖులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. అపరిమితమైన స్వేచ్ఛ ఏ మీడియాకి ఉండదు అనే మాట అందరూ చెబుతున్నారు, అయినా సరే జరగాల్సిన నష్టం జరిగిపోతున్నది. సమాజంలో.. ముఖ్యంగా స్త్రీలపట్ల జరుగుతున్న దుష్ప్రచారం, వ్యక్తిత్వ హననం మీడియాగా చలామణి అవుతున్న సోకాల్డ్ సోషల్ మీడియాలోనే ఎక్కువగా జరుగుతున్నది. గతవారం చెన్నైలో జరిగిన ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశాలను జ్యోతి వెలిగించి ప్రారంభించిన ప్రముఖ సినీనటి, సామాజిక కార్యకర్త, ఎఐఎడిఎంకె నాయకురాలు గౌతమి మీడియాకు, మీడియాగా చలామణి అవుతున్న సోషల్ మీడియాకు ఉన్న తేడాను అద్భుతంగా వివరించారు. 'రోజూ పొద్దున లేస్తే పళ్ళు తోముకున్న దగ్గరనుంచి రాత్రి పడుకునే వరకు వ్యక్తిగత జీవితంలో జరిగే విషయాల దగ్గరనుంచి మొదలుపెట్టి ఏది పడితే అది మాట్లాడటం, రాయటం చేస్తున్న ఒక వేదికను మీడియా అని ఎలా అంటారు? ఒక సమాచారాన్ని సేకరించి దానిలోని నిజానిజాలను తరచి చూసి క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను నిగ్గు తేల్చి పత్రికల్లో ప్రచురించి ప్రజలకు సమాచారాన్ని చేరవేసేది జర్నలిజం అవుతుంది తప్ప నోటికి ఏది వస్తే అది మాట్లాడటం, మెదడుకు ఏది తోస్తే అది రాసేసి జనం మీదికి వదలడం జర్నలిజం కాబోదు. దీనిగురించి మీరంతా ఈ రెండు రోజుల సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది' అని ఆమె సూచించారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న రాజకీయపక్షం గొడుగు కింద కూర్చుని ఒక ప్రబుద్ధుడు మీడియా పేరిట మాజీ ముఖ్యమంత్రి మీద, ఆయన భార్యా పిల్లల మీద చేసిన దుర్మార్గమైన వ్యాఖ్యలు శరవేగంగా ప్రచారంలోకి వచ్చాయి. ఆ మనిషి ఒక యూట్యూబర్. అతను ఈమాటలు మాట్లాడింది మరొక యూట్యూబ్ ఛానల్లో. అతనికి కానీ, ఆ యూట్యూబ్ ఛానల్‌కు కానీ మీడియా అని చెప్పుకునే అర్హత లేదు. ఆంధ్రప్రదేశ్‌లో అధికార పక్షానికి ఒక వ్యవస్థ ఉంది. ఆ వ్యవస్థ ఇటువంటి పలు యూట్యూబ్ ఛానళ్లను, ఈ ప్రబుద్ధుడి వంటి పలువురు యూట్యూబర్లను పెంచి పోషిస్తున్నది. ఇది ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఒక అధికారపక్షం మాత్రమే చేస్తున్నదనడానికి కూడా లేదు. ఈ జాడ్యం దేశంలోని పలు రాజకీయపక్షాలకు అంటుకుని చాలా కాలమైంది. తమను వ్యతిరేకించే రాజకీయవేత్తలను నిందించడానికి, నీచంగా చిత్రించడానికి, పలుచన చేయడానికి, అపఖ్యాతిపాలు చేయడానికి చాలా రాజకీయపక్షాలు ఇదే పని చేస్తున్నాయి. ఇటీవలే హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబంమీద అవాకులు చవాకులు పేలిన వ్యక్తి మాటల్ని ప్రసారం చేసిన ఇద్దరు మహిళల అరెస్టు సందర్భంగా.. రాజకీయపక్షాలు ఎలా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి సోషల్ మీడియా పేరుతో లెక్కలేనన్ని యూట్యూబ్ ఛానళ్ళను, యూట్యూబర్లను పెంచి పోషిస్తున్నాయో మనం మాట్లాడుకున్నాం. వీళ్లంతా యూట్యూబ్‌లో ఇన్ఫ్లుయన్సర్లనే పేరిట, జర్నలిస్టులనే పేరిట రాజకీయ నాయకుల ప్రయోజనాలను కాపాడేందుకు ఒక చిన్న క్యాబిన్, ఒక కెమెరా సిద్ధం చేసుకుని రంగంలోకి దిగిపోతున్నారు. మరికొంతమంది మరింత అసభ్యమైన భాష, కంటెంట్ వాడుతూ గాసిప్స్, రెచ్చగొట్టే సమాచారాలతో సమాజంలో మతాలు, కులాలు, మనుషుల మధ్య ఘర్షణలకు కూడా కారణం అవుతున్నారు. ఈ ధోరణిని నియంత్రించడమెలా అనే విషయంపై రాజకీయపక్షాలన్నీ కూర్చుని మాట్లాడుకుంటే బాగుంటుంది. ఎందుకంటే ఈ మొత్తం వ్యవహారంలో అప్రతిష్టపాలు అవుతున్నది, పరువు పోగొట్టుకుంటున్నది రాజకీయ పార్టీలే కాబట్టి వాళ్ళే కూర్చుని మాట్లాడుకుంటే బాగుంటుంది. అయితే అది సాధ్యమయ్యే పనిలా కనిపించడం లేదు. తమ ప్రత్యర్థులను నీచంగా చిత్రించడానికి, వారిని, ముఖ్యంగా వారి కుటుంబ సభ్యులను అప్రతిష్టపాలు చేయడానికి, ముఖ్యంగా స్త్రీలను కించపరచడానికి జరుగుతున్న ఈ ఘోరాన్ని ఆపడానికి ఎవరూ ముందుకు రావడం లేదు, ఆలోచించడం లేదు. ఇలాంటి జాడ్యం ఇటీవల ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి భార్యాబిడ్డల గురించి అసభ్యకరంగా మాట్లాడిన యూట్యూబర్ ఒక్కడికే పరిమితం కాలేదు. ముఖ్యంగా స్త్రీలను పలుచనచేసి మాట్లాడే హక్కు తమకు సంపూర్ణంగా ఉందని చాలామంది రాజకీయ నాయకులు అనుకుంటూ ఉంటారు. భాష కొంచెం అటుఇటుగా ఉన్నా, భావం మాత్రం అంతిమంగా స్త్రీలను కించపరచడం, వారి నైతికతకు సంబంధించిన అంశాలమీద దిగజారుడు మాటలు మాట్లాడటం పరిపాటిగా మారింది.



: అమృత్ తెలంగాణ బ్యూరో సీనియర్ రిపోర్టర్ కేఎల్ రాములు,

# అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ విడుదల చేసినా ఎమ్మెల్యే రామారావు పటేల్,



అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



ఫైర్ సిబ్బంది

నిర్మల్ జిల్లా బైంసా ఏప్రిల్ 14 అమృత్ తెలంగాణ బైంసా పట్టణ కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ చేతుల మీదుగా అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ను విడుదల చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ రవి, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు

# మాస్టర్ జె. నైనిక్ అంబేద్కర్ పుట్టిన రోజు సందర్భంగ నిరుపేదలకు దుస్తుల పంపిణీ



నిరుపేదలకు దుస్తులు అందజేస్తున్న మా అమ్మానాన్న పౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు



అన్నదానం చేస్తున్న మా అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్

నిర్మల్ జిల్లా లోకేశ్వరం ఏప్రిల్ 14 అమృత తెలంగాణ లోకేశ్వరం మండలం మోహాల గ్రామానికి చెందిన విజయ డైరీ ఇంచార్జీ మేనేజర్ దండే రమేష్, మనుమడు జె నైనిక్ అంబేద్కర్ ఈరోజు అనగా ఏప్రిల్ 14 న మొదటి పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సాయంతో నిర్మల్ మండలం చిట్యాల సిర్గాపూర్ తదితర ప్రాంతాలలో నివసిస్తున్న నిరుపేద యాచకులకు మా అమ్మ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు 25 మందికి నూతన దుస్తులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నూతన దుస్తులు అందుకున్న నిరుపేదలు నైనిక్ అంబేద్కర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ వారి ఆశీర్వాదాలు తెలపడం జరిగిందిఈ సందర్భంగా మా అమ్మా నాన్న ఫౌండేషన్ చైర్మన్ యం ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి వారి పిల్లల పుట్టినరోజున వృధాఖర్చు చేయకుండా ఇలా నిరుపేదలకు సాయం అందించినచో ఎంతో పుణ్యం లభిస్తుందని ఆయన తెలియజేశారు

# జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్‌గా అంజనీకుమార్

అమరావతి :అమృత్ తెలంగాణ: తెలంగాణ నుంచి ఎపి కేడర్‌కు కేటాయించిన ఇద్దరు ఐపిఎస్ అధికారులకు ప్రభుత్వం పోస్టింగులు ఇచ్చింది. ఈ మేరకు జిఓఆర్‌టి నెంబరు 705ను సోమవారం విడుదల చేసింది. జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్‌గా అంజనీకుమార్‌ను నియమించారు. ఇప్పటి వరకు ఆ పదవిలో కొనసాగుతున్న హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్‌ను రిలీవ్ చేశారు. అభిలాష్‌బిస్తాను ఎపి రోడ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది.

# అంబేద్కర్ చౌక్ నందు ఏర్పాటుచేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పాల్గొనడం జరిగింది





అంబేద్కర్ సెల్యూట్ చేస్తున్న జిల్లా పోలీస్ అధికారి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అంబేద్కర్ చౌక్ నందు ఏర్పాటుచేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చదువుకు ఉన్న ప్రాముఖ్యతను తెలుసుకొని, మంచి చదువులు చదివి ఉన్నత స్థానాలకి ఎదగాలని కోరుకున్నారు అదేవిధంగా మహిళల సాధికారతపై జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ అన్ని రకాలుగా అభివృద్ధి చెందినప్పుడు రాష్ట్రం దేశం అభివృద్ధి బాటలో నడుస్తుందని తెలిపారు. జయంతి సందర్భంగా నాయకులు తెలిపిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. యువత మహనీయుల బాటలో నడిచి ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు డాక్టర్ బాబు జగ్జీవన్ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన పలు పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతి ప్రధానం చేసి అభినందించారు.

# జందాపూర్ గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుకలో పాల్గొన్న మేకల మధుకర్ ప్రభుత్వ న్యాయవాది పిపి



జందాపూర్ గ్రామంలో అంబేద్కర్ జయంతి పాల్గొన్న మేకల మధుకర్ ప్రభుత్వ న్యాయవాది



అంబేద్కర్ జయంతి సందర్భంగా మాట్లాడుతున్న తాజా మాజీ సర్పంచ్ పసుల గంగాధర్

అదిలాబాద్ గ్రామీణ మండలంలో జందాపూర్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు అంబేద్కర్ ఆశలను కొనసాగించాలని ప్రపంచ మేధావి ప్రభుత్వ న్యాయవాది మేకల మధుకర్ పేర్కొన్నారు జందాపూర్ మాజీ తాజా సర్పంచ్ పసుల గంగాధర్ లిమాట్లాడుతూ ప్రతి సంవత్సరమా జందాపూర్ గ్రామంలో అంబేద్కర్ జయంతులు నిర్వహిస్తున్నాము ప్రతి సంవత్సరం అంబేద్కర్ ఆశయాలు అనుగుణంగా ఆయన గొప్పదనాన్ని చేసిన సేవల్ని ఇంకా ప్రజల్లో పెరుగుతున్న తప్ప తగ్గడం లేదని ఆయన పేర్కొన్నారు ప్రతి ఒక్కరు అంబేద్కర్ బాటలో నడవాలని గ్రామ ప్రజలకు కోరారు ఈ కార్యక్రమంలో అమృత్ తెలంగాణ తెలుగు దినపత్రిక చైర్మన్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు సింగిడి అమృత్ మరియు సంజయ్ రెడ్డి అడ్వకేట్ గ్రామ పంచాయతీ సెక్రెటరీ మరియు కారోబార్ మధుకర్ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ మరియు గ్రామస్తులు మరియు దళితులు పాల్గొన్నారు

# గంజాయిపై నిఘా

ఉట్నూర్, ఏప్రిల్ 14 :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ నిషేధిత గంజాయితో యు వత జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. కొందరు మత్తు లో మరణిస్తుండే మరికొందరు అధిక సంపాదన ఆశతో సరఫరా చేస్తూ పట్టుబడి జైలుపాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇటీవల కరీంనగర్, హైదరాబాద్, జగిత్యాల్ వంటి పట్టణాల్లో గంజాయి కేసులు నమోదు కాగా.. వాటి మూలాలు మనవద్దే ఉన్నాయన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో ఇటీవల ముమ్మర తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల్లో ఏకంగా పదికిలోల గంజాయి పట్టుకోవడమే కాకుండా పది మందిపై కేసు కూడా నమోదు చేశారు. ఏజెన్సీలో రైతులు పండిస్తే వారిపై కేసు లు నమోదు చేయడమే కాకుండా.. వారికి ప్రభుత్వ పథకాలైన రైతుబం ధు, సబ్సిడీ విత్తనాలు, ఉచిత విద్యుత్ వంటి పథకాలు రాకుండా చర్యలు తీ సుకుంటున్నారు. అమాయక గిరిజనులు గంజాయితో నష్టపోకుండా ఉడేందుకు పోలీసులు మీకోసం పేరిట గంజాయిపై గిరిజన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేశారు. అలాగే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మూడు రోజుల్లో పది మందిపై కేసులు

మండలంలోని కుమ్మరితండా పరిధిలోని రాముగూడలో దాడులు నిర్వహించి కుమ్ర సోనేరావు ఇంటి వెనుకాల ఉన్న అరటి పెరడిలో సుమారు 20 గంజా యి మొక్కలను ధ్వంసం చేశారు. రైతుపై కేసు నమోదు చేయడమే కాకుండా ప్రభుత్వ పథకాలు రాకుండా కలెక్టర్ ప్రతిపాదించారు. అలాగే పట్టణం మీదు గా ఆటోలో ముగ్గురు వ్యక్తులు రెండు కిలోల గంజాయి తరలిస్తున్నారన్న స మాచారంతో ఐటీడీఏ సమీపంలో ఆటోను తనిఖీ చేసి బేల మండలంలోని పార్సువాడకు చెందిన మారుతి విక్రయించగా అతనితోపాటు మరో ముగ్గురిపై కేసులు నమోదు చేశా రు. అలాగే ఇటీవల మండలంలోని బీర్సాయిపేట్‌కు చెందిన ఎల్లయ్యతో మండలంలోని లక్షెటిపేట్‌కు చెందిన గంగన్న ఐదు కిలోల గంజాయిని మ హారాష్ట్ర నుంచి కొనుగోలు చేసి అధిక ధరలకు కరీంనగర్, హైదరాబాద్‌లో విక్రేయించేందుకు సి ద్ధంగా ఉండడంతో పోలీసులు దాడులు చేసి వారిని రిమాండ్‌కు పంపారు.

# అంబేద్కర్ అందరివాడు ...దేశానికి ఆయన సేవలు చిరస్మరణీయం



అమృత్ తెలంగాణ: ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం(తెలంగాణ భవన్)లో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉ పేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వర రావు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేండ్ల పాలనలో అంబేదర్‌పై చూపిన గౌరవం ప్రత్యేకమైనదన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అదనపు కలెక్టర్ విద్యాచందన, భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పీవో రాహుల్, కారేపల్లి, ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యేలు బానోత్ మదన్‌లాల్, బానోత్ హరిప్రియానాయక్ తదితరులు అంబేద్కర్‌కు ఘనంగా నివాళి అర్పించారు. –నమస్తే నెట్‌వర్క్

# అలాంటి వారికే అవకాశాలు ఎక్కువంటున్న నిధి అగర్వాల్..!



స్లో అండ్ స్టడీ విన్స్ ద రేస్ అనే ఫార్ములాతో వస్తున్న అవకాశాలను చేసుకుంటూ వెళ్తుంది ఉత్తరాధి భామ నిధి అగర్వాల్. అక్కినేని బ్రదర్స్ నాగ చైతన్య అఖిల్ ఇద్దరితో సినిమాలు చేసిన నిధి అగర్వాల్ ఆ సినిమాలు నిరాశపరచడంతో కెరియర్ రిస్క్ లో పడ్డది. ఆ టైం లోనే పూరీ జగన్నాథ్ ఇస్మార్ట్ శంకర్ అమ్మడికి మంచి బ్రేక్ ఇచ్చింది. ఆ సినిమాలో మరో హీరోయిన్ నభా నటేష్ ఉన్నా కూడా నిధి గ్లామర్ షోకి ఎక్కువ మార్కులే పడ్డాయి. ఆ సినిమాతో కెరియర్ జోష్ వచ్చినా ఆ తర్వాత మళ్లీ యదావిధిగానే ఆఫర్లు లేకుండాపోయాయి. ఇక ఖాళీగా ఎందుకని గల్లా అశోక్ తొలిపరిచయంగా చేసిన హీరో సినిమాలో నటించింది నిధి అగర్వాల్. ఈ గ్యాప్ లో కోలీవుడ్ షిఫ్ట్ అయిన అమ్మడు అక్కడ జయం రవి శింబు లాంటి స్టార్ హీరోలతో నటించి క్రేజ్ తెచ్చుకుంది. తెలుగులో కన్నా తమిళంలో ఎక్కువ పాపులర్ అయ్యింది నిధి అగర్వాల్. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తన సినీ జర్నీపై స్పందిస్తూ.. సినిమాల్లో 20 శాతం నటనకు 80 శాతం అందానికి ప్రాముఖ్యత ఉంటుందని చెప్పింది. కేవలం టాలెంట్ ఉంటేనే ఛాన్సులు వస్తాయంటే తాను ఒప్పుకోను..

# సెకండ్ ఇన్నింగ్స్ కి రెడీ అంటున్న ముద్దుగుమ్మ..!





బెంగళూరు భామ ప్రణీత నటించిన తక్కువ సినిమాలతోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. స్టార్ హీరోయిన్ క్రేజ్ తెచ్చుకోకపోయినా సరే ప్రణీత అంటే ఇష్టపడే ప్రేక్షకులు కూడా ఉన్నారని చెప్పొచ్చు. కన్నడంలో పోకిరి రీమేక్ సినిమాతో తెరంగేట్రం చేసిన ప్రణీత తెలుగులో కూడా సినిమాలు చేసింది. యువ హీరోలు తనీష్ రామ్ సినిమాల్లో నటించిన ప్రణీత సుభాష్ పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది సినిమాలో కూడా నటించి మెప్పించింది. ఓ పక్క సినిమాలు చేస్తూనే సడెన్ గా అమ్మడు పెళ్లి చేసుకుని షాక్ ఇచ్చింది. బిజినెస్ మెన్ నితిన్ రాజ్ తో ప్రణీత పెళ్లి అందరిని సర్ ప్రైజ్ చేసింది. ప్రణీతకి అప్పుడే పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేకపోయినా నితిన్ రాజ్ పెళ్లి ప్రపోజల్ తెచ్చే సరికి ఆమె కాదనలేకపోయిందట. ఈ జూన్ లో ఒక బేబీకి కూడా జన్మనిచ్చింది ప్రణీత. ఆఫ్టర్ మ్యారేజ్ సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చిన ప్రణీత కరోనా లాక్ డౌన్ టైం లో తన సోషల్ యాక్టివిటీస్ తో ప్రేక్షకులను అలరించింది. తనవంతు సాయంగా కొవిడ్ లాక్ డౌన్ టైం లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసింది ప్రణీత. ఇక ఇప్పుడు ప్రణీత మళ్లీ సినిమాలు చేసేందుకు రెడీ అంటుంది. సెకండ్ ఇన్నింగ్స్ గురించి మాట్లాడుతూ ఒక మదర్ గా నా కర్తవ్యాన్ని పూర్తి చేశాను.. ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాను అంటూ చెప్పింది. పాపని పుట్టగానే నీ కర్తవ్యం పూర్తయిందా అంటూ ప్రణీత మీద నెటిజెన్లు కామెంట్ చేస్తున్నారు. అయితే భర్త ఎంత బిజినెస్ మెన్ అయినా కూడా తనకంటూ ఒక జాబ్ రోల్ ఉండాలని మళ్లీ తనకు ఇంత క్రేజ్ తెచ్చిన సినిమాల పైనే ఫోకస్ చేయాలని చూస్తుంది ప్రణీత. అందుకే తన ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అలరిస్తుంది. ఈమధ్యనే మళ్లీ తన హాట్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది ప్రణీత.

# ఎన్టీఆరా.. మజాకా.. జపాన్ భాషలో రప్ఫాడించాడు..!

మెగా పవర్ స్టార్ రాంచరణ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ కాంబినేషన్లో తెరకెక్కిన మూవీ 'ఆర్ఆర్ఆర్ (రౌద్రం రణం రుధిరం). మెగా నందమూరి అభిమానులతోపాటు యావత్ ఇండియన్ ప్రేక్షకులను 'ఆర్ఆర్ఆర్' మూవీ ఓ రేంజులో ఆకట్టుకుంది. విడుదలకు ముందు నుంచి ఈ సినిమాపై భారీ అంచనాలను పెంచిన రాజమౌళి అందుకు తగ్గట్టుగానే 'ఆర్ఆర్ఆర్'ను తెరకెక్కింది.'అల్లూరి'గా రాంచరణ్ కొమురంభీంగా రాంచరణ్ సీతగా అలియాభట్ బ్రిటిష్ ప్రిన్సెస్ గా ఓలివియాలు నటించారు. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ వెటరన్ బ్యూటీ శ్రియ శరణ్ సముద్రఖని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను నెలకొల్పి నిర్మాతలకు కాసులవర్షం కురిపించింది. తాజాగా ఈ మూవీని జపాన్ భాషలోనూ విడుదల చేస్తున్నారు. ఈక్రమంలోనే 'ఆర్ఆర్ఆర్' బృందం జపాన్ రాజధాని టోక్యోలో పర్యటిస్తోంది. ఉదయం నుంచే రాంచరణ్ ఉపాసన ఎన్టీఆర్ ప్రణతి రాజమౌళి రమ తదితరులు 'ఆర్ఆర్ఆర్' ప్రమోషన్స్ ను ఓ రేంజులో చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వీడియోలు నెట్టింట్లో వైరల్ గా మారాయి. కొద్దిసేపటి క్రితమే 'ఆర్ఆర్ఆర్' బృందం టోక్యో వీధుల్లో 'దోస్తీ' పాటకు సందడి చేస్తూ రోడ్డును దాటారు. ఈ వీడియోను ఎన్టీఆర్ రాంచరణ్ పోస్టు చేయగా వైరల్ అయింది. అయితే తాజాగా ఎన్టీఆర్ అభిమానులు మరో వీడియోను నెట్టింట్లో వైరల్ చేస్తున్నారు. ఈ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా టోక్యోలో 'ఆర్ఆర్ఆర్' టీం మీడియా ప్రెస్ మీట్ నిర్వహించింది. అయితే ఎన్టీఆర్ ఎవరూ ఊహించని విధంగా జపాన్ భాషలో మాట్లాడి అక్కడి వారిని ఆకట్టుకున్నాడు. జపాన్ భాషలో అభిమానులను పలుకరించడంతోపాటు వారిని ఉత్తేజపరిచాడు. సుమారు 70 సెకన్ల నిడివితో ఉన్న ఈ వీడియో ఎన్టీఆర్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.




# బ్యూటీ విత్ టాలెంట్.. లైగర్ భామ షైనింగ్..



బాలీవుడ్ అందాల భామ అనన్యా పాండే ఇటీవలే రౌడీ బోయ్ విజయ్ దేవరకొండతో లైగర్ సినిమాలో నటించింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆ సినిమా పాన్ ఇండియా రిలీజైంది. సినిమా అంచనాలకు తగినట్టుగా లేకపోవడంతో బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఆ సినిమాపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అనన్యా పాండే కూడా సినిమా రిజల్ట్ తో డీలా పడ్డది. లైగర్ తో సౌత్ లో సత్తా చాటాలని అనుకున్న అమ్మడికి సినిమా ఫెయిల్యూర్ షాక్ ఇచ్చింది. అంతేకాదు లైగర్ హిట్ కొడితే తెలుగులో వరుస సినిమాలు చేయాలని అనుకున్న ఆలోచనలకు బ్రేక్ పడేలా చేసింది. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2 సినిమాతో సిల్వర్ స్క్రీన్ కి ఎంట్రీ ఇచ్చిన అనన్యా పాండే చేసిన మూడు నాలుగు సినిమాలకే బ్యూటీ విత్ టాలెంట్ అనిపించుకుంది. లైగర్ సూపర్ హిట్ అయితే ఎలా ఉండేదో కానీ ఆ సినిమా ఫ్లాప్ అవడం అమ్మడికి తెలుగులో మరో ఛాన్స్ రాకుండా చేసింది. ప్రస్తుతం బాలీవుడ్ లో కో గయే హమ్ కహన్ డ్రీం గర్ల్ 2 సినిమాల్లో నటిస్తుంది అనన్యా పాండే. సినిమాలే కాదు వెబ్ సీరీస్ లకు అమ్మడు ఓకే అనేస్తుంది. గెహ్రాయాన్ వెబ్ సీరీస్ లో దీపీకా పదుకొనేకి పోటీగా అనన్యా పాండే నటనతోనూ అందంతోనూ మెప్పించింది. సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో కూడా ఫ్యాన్స్ ని ఆకట్టుకుంటుంది

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com